క్లుప్తంగా

మంగరాయుని ఉత్సవాలకు ధ్వజారోహణం


ప్రత్యేక అలంకరణలో శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో ధ్వజారోహణంతో హనుమద్రతం, మహారథోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచార్ ఆధ్వర్యంలో మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీసుబుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు వేకువజామున మంగరాయ అంజనేయస్వామికి నిర్మల్య విసర్జనం, పంచామృతాభిషేకం, గోపూజ, లక్ష్మి ధాన్యపూజ, ధ్వజారోహణం పూజలు జరిగాయి. నేడు హనుమద్రతం ఉంటుందని ఆయన తెలిపారు. హనుమద్రత శ్రవణం, పవమాన హోమం, స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, బెంగళూరు నుంచి తెచ్చిన వివిధ రకాల పూలతో అలంకరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు.

15న సీపీఎం మహాసభ

కౌతాళం: సీపీఎం కౌతాళం మండల కమిటీ 7వ మహాసభలు ఈనెల 15న ఎరిగేరి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్నలు తెలిపారు. ఈ మహాసభలను ప్రతి మూడు సంవత్సరాలకోకసారి నిర్వహిస్తున్నామన్నారు. సభలో ఈ మధ్యకాలంలో జరిగిన పోరాటాలలో ఎన్ని విజయాలు సాధించాం, ఇంకా ప్రజలకు అవసరమైన సమస్యలపై చర్చించుకుని భవిష్యతు కర్యాచరణ రూపొందిస్తామన్నారు. పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కమిషనర్ విస్తృత పర్యటన

ఆదోని టౌన్: మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ గురువారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. షేర్‌ఖాన్ కొట్టాల, ఎంఐజీ, ఎల్‌ఐజీ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువలను పరిశీలించారు. అరుంజ్యోతినగర్, ఎన్‌జీఓస్ కాలనీల్లోని మురుగు కాలువలను శుభ్రం చేయాలని శానిటరీ వర్కర్లకు సూచించారు.

పురుగుమందు వాడకంలో జాగ్రత్తలు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు పంటలకు పురుగు మందుల వాడకంలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వర రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో వ్యవసాయశాఖ - విల్లోఫుడ్ పురుగు మందుల కంపెనీ ఆధ్వర్యంలో పురుగు మందుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు మోతాదుకు మించి పురుగు మందులు పిచికారీ చేస్తే పంట నష్టంతో పాటు, భూసారం తగ్గిపోయే అవకాశం ఉందని చెప్పారు. పురుగు మందులు స్ప్రే చేసేటప్పుడు చేతులకు గ్లౌజ్‌లు వేసుకోవాలని, పిచికారీ చేసిన తరువాత సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని, సరిగా శుభ్రం చేసుకోకుండా భోజనం చేస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు చెన్నకేశవరెడ్డి, భీమన్నగౌడ్, శ్రీరంగా, నబి రసూల్, మోహబుబ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్:మున్సిపాలిటీలో పనిచేస్తూ గత ఐదేళ్లలో మృతి చెందిన 12మంది పారిశుధ్య కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా, తాలూక కార్యదర్శులు అంజిబాబు, రాముడులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నాగరాజు, ఇస్మాయిల్, మునీంద్ర, గోరుబాషా తదితరులు పాల్గొన్నారు.

రాజీకి రాజమార్గం

- రేపు జాతీయ లోక్‌అదాలత్
- కేసులు రాజీ కుదిర్చేందుకు పోలీసుల కృషి
- ఇరువర్గాలకు కౌన్సెలింగ్
- నియోజకవర్గంలో 380 కేసుల్లో 135 రాజీకి సిద్ధం
- గత సంవత్సరంలో 281 కేసుల్లో 55 మాత్రమే రాజీ


ఫిర్యాదుదారుడు, కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు

ఆదోని అర్బన్: తగ్గితే ఓడినట్లు కాదు..అందరి మనస్సులు గెలిచినట్లు. ఈనెల 14న ఆదోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'రాజీ మార్గమే రాజమార్గం' అంటూ సుప్రీంకోర్టు అవకాశమున్న చిన్నచిన్న కేసులను రాజీ కుదిర్చే అవకాశం ఇవ్వడంతో పోలీసు అధికారులు, న్యాయవాదులు కక్షిదారులను కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇరు వర్గాలను నచ్చజెప్పి కేసు రాజీ అయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

రాజీకి అర్హత కలిగిన కేసులు 380

ఆదోని నియోజకవర్గంలో ఏడు పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాయి. ఆయా స్టేషన్ల పరిధిలో రాజీకి అర్హత కలిగిన 380 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి కోర్టు పనులు చూసేందుకు ఒక కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ ఉంటారు. వీరిలో అధిక మంది ఉన్నత విద్యావంతులు, చట్టాలపై సంపూర్ణ అవగాహన ఉన్నవారే. వీరు కక్షిదారులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. కోర్టులు, పోలీసు స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని తెలియజేస్తున్నారు. ఇరువర్గాల వారికి తప్పును ఎత్తి చూపుతారు. అధర్మం వల్ల కలిగే నష్టాలను సున్నితంగా తెలియజేస్తున్నారు. కౌన్సెలింగ్ ఇప్పించి ఇరువర్గాల మధ్య సయోధ్య కుదర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ తదితర వేలాది కేసుల పరిష్కారానికి తెర వెనక ఉండి గట్టి రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే ఇటీవల కాలంలో రాజీ కేసుల సంఖ్య అమాంతంగా పెరిగిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సహకరిస్తున్న సచివాలయ మహిళా పోలీసులు

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తేవడంతో కోర్టు పనులు మరింత సులభతరమయ్యాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. వివాదాలుపడే వారి పూర్తి సమాచారం సేకరణలో సచివాలయ మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కేసుల్లో ఇరువర్గాల వారిని సమావేశ పరిచేందుకు స్టేషన్ నుంచి సకాలంలో సమాచారం ఇచ్చేందుకు సహాయపడుతున్నారు. రాజీ యత్నాల్లో కూడా వీరు ప్రధాన భూమిక పోషిస్తున్నారు.

రాజీకాదగిన కేసులు

చిన్నచిన్న గాయపడిన కేసులు, చిన్నచిన్న తగాదాలు, భార్యాభర్తల గొడవలు, గ్యాంబ్లింగ్ కేసులు, దొంగతనం, చీటింగ్, వాహనాలపై చిన్నచిన్న కేసులు, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులు మాత్రమే రాజీపడేందుకు అవకాశం ఉందని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నాయి. ప్రస్తుతం పోలీసులు, న్యాయవాదులు కౌన్సెలింగ్ నిర్వహించి 380 కేసుల్లో 135 కేసులను రాజీకి ఒప్పించారు. వీరు శనివారం జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో జడ్జి ఎదుట రాజీ కుదుర్చుకోనున్నారు. పెట్టి కేసులు 700 కొట్టివేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. గత సంవత్సరంలో 281 కేసుల్లో 55 కేసులు రాజీ పడ్డారు. ఈ ఏడాది పోలీసులు కక్షిదారులకు మరింత అవగాహన కల్పించి, రాజీ కుదుర్చి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా చూస్తున్నారు.

రాజీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తాం



చిన్నచిన్న కేసులు, తగాదాల విషయంలో ఇరువర్గాల మేలు కోసమే సుప్రీం కోర్టు రాజీ పడేందుకు అవకాశమిచ్చింది. ఇందుకోసం శనివారం జాతీయ లోక్‌అదాలత్ ఏర్పాటు చేశారు. ప్రతి కేసును రాజీ చేసేందుకు ఇరువర్గాల్లో అవగాహన కల్పిస్తున్నాం. రాజీ వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నాం. ఫిర్యాదుదారుడు రాజీ అయ్యేందుకు అంగీకారానికి వస్తే ఆ కేసు వివరాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్తాం. ఫిర్యాదుదారుడు అంగీకారం మేరకే లోక్‌అదాలత్‌లో రాజీ కుదురుతుంది. లేదంటే కేసు కొనసాగుతుంది. ఇప్పటివరకు 850 ఉన్న కేసుల్లో 135 కేసులు రాజీకు ఒప్పుకున్నారు. మిగిలిన రెండు రోజుల్లో మరిన్ని కేసుల రాజీ కోసం ప్రయత్నిస్తాం.

– సోమన్న, ఆదోని డీఎస్పీ

కేసుల వల్ల ఇబ్బందులను తెలియజేస్తున్నాం



గొడవల వలన కేసుల్లో ఇరుక్కుంటే దాని వల్ల పడే ఇబ్బందులు, తప్పులు ఇరువర్గాల వారికి తెలియజేసి రాజీవల్ల కలిగే మేలును వివరిస్తాం. కేసుల్లో ఇరుక్కుంటే కుటుంబాలకు దూరమవుతారని, ఆ కష్టాలను కోర్టు చుట్టూ తిరిగే సమయాన్ని వృథా చేయడమేగాకుండా మనశ్శాంతి కోల్పోవడం వంటివి ఇరువర్గాల వారికి తెలియజేస్తున్నాం. ఇకపై గొడవలు పడకుండా ఉండేందుకు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి రాజీ పడేలా అవగాహన కల్పిస్తాం.

– శ్రీరామ్, వన్ టౌన్ సీఐ

వైఎస్ జగన్‌ను కలిసిన ఎర్రకోట



ఎమ్మిగనూరుటౌన్: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో గురువారం నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి ఆయన సతీమణి నిరుపమారెడ్డి, కుమారుడు రాజీవ్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆదోని జోతిష్యుడికి అవార్డు


జోతిష్యుడు కమలనాభను అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: తిరుమల తిరుపతి మహతి ఆడిటోరియంలో బుధవారం ఎస్.జోతిష్య పరిశోధనా సంస్థ వారు జోతిష్య మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జోతిష్యం మరియు వాస్తుశాస్త్రంలో అనుభవం ఉన్న వారికి సంస్థ అధిపతి డాక్టర్ నరసింహస్వామి అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో ఆదోనికి చెందిన ప్రముఖ కె.పి. పద్ధతి జోతిష్యుడు కమలనాభను జోతిష్య వాస్తు పండిట్ అవార్డుతో సత్కరించారు.

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా


విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని అర్బన్: రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకుని విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవడంతో పాటు ఉత్పత్తి అయిన విద్యుత్‌తో ఆదాయం పెంచుకోవచ్చని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. గురువారం ఆర్టగేరి బస్టాండు సమీపంలోని వీఎస్‌బీ ఫంక్షన్ హాలులో 'ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన'పై విద్యుత్ వినియోగదారులకు విద్యుత్‌శాఖ ఈఈ హరి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇంటి పైకప్పు నుంచి సోలార్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. ఇందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. దీంతో విద్యుత్ ఆదా చేసుకోవడంతో పాటు అంతరాయం లేకుండా విద్యుత్, ఓల్టేజీ సమస్యలు ఉండవన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీగా ఈ పథకాన్ని అందిస్తుందన్నారు. ఒక కిలో వాట్ సామర్థ్యంతో 120 యూనిట్లు వస్తుందని, ఇందుకు ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. కేవలం మధ్యతరగతిలో ఉన్న గృహిణులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, పరిశ్రమలకు ఈ పథకం వర్తించదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, విద్యుత్‌శాఖ డీఈలు పురుషోత్తం, ఖాజావలి, సంతోష్, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలకు రేపు ఎన్నికలు

కౌతాళం: సాగునీటి సంఘాలకు ఎన్నికల కోసం అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. శనివారం ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు. చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అనివార్యమైతే బ్యాలెట్ బాక్సులు ఉపయోగించేందుకు సిద్ధం చేసినట్లు ఎల్‌ఎల్‌సీ డీఈ షఫీవుల్లా తెలిపారు. మండలంలో 7 సాగునీటి సంఘాలుఉండగా 9,908 మంది రైతులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతి సంఘంలో 12 టీసీ మెంబర్ల ఎన్నిక తర్వాత సాగునీటి సంఘం అధ్యక్షుడిని, ఉపాధ్యక్షుడిని ఎన్నుకునే విధంగా ప్రణాళిక తయారు చేశారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎల్‌ఎల్‌సీ అధికారులు, రెవెన్యూ, ఇటూ పోలీస్‌శాఖ సమయమవుతోంది.

గోనెగండ్ల : సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహించనున్నారు. మండలంలో గాజుల దిన్నె ప్రాజెక్టు పరిధిలో ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, తుంగభద్ర దిగువ కాలువ పరిధిలో మూడు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. జీడీపీ కింద ఐదు సాగునీటి సంఘాలకు హెచ్. కైరవాడి, తిప్పనూరు, ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, జీడీపీ కార్యాలయం, తుంగభద్ర దిగువ కాలువ కింద మూడు సంఘాలకు గోనెగండ్ల, అలువాల, పెద్దనేలటూర్ పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గురువారం తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

పెద్దకొత్తిలిలో పశువైద్య శిబిరం


పశువుల వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి

నందవరం : మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామంలో రిలయన్స్, ఆర్డీప్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం గ్రామంలో వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, టీకాలు వేశారు. అనంతరం గేదెలకు చూడి పరీక్షలు చేపట్టారు. రైతులకు దాన, మందులు, పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంతో పాటు రైతులు పాడి పోషణలో రాణించాలన్నారు. పాడి పశువుల ద్వారా ఆదాయం పెంచుకుని అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీప్ సంస్థ కార్యకర్తలు కరుణప్ప, ఉసేని, సిబ్బంది మల్లికార్జున, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి


మాట్లాడుతున్న నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ చిరంజీవి


బసాపురం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

నందవరం : గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో అర్జీ సమర్పించి పరిష్కరించుకోవాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ చిరంజీవి సూచించారు. గురువారం మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మండల ప్రత్యేక అధికారి రమణారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ..అన్ని రకాల సమస్యలను అర్జీల రూపంలో అందిస్తే పరిష్కారం చూపిస్తామన్నారు. గ్రామంలో భూ సమస్యలపై 48 అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ డీటీ మహేష్, ఆర్‌ఐ జెర్మియా, మండల సర్వేయర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ శివరాముడు అన్నారు. మండలంలోని బసాపురం, నాగనాథనహళ్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతులు అర్జీల రూపంలో దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

కోసిగి: భూములకు సంబంధించిన సమస్యలుంటే గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. గురువారం కోసిగి మండలంలోని నేలకోసిగి, గొడుగల్లు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్‌ఐ తిక్కస్వామి, వీఆర్వోలు బసవరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ'ని జయప్రదం చేయండి

- రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- నేడు కర్నూలులో నిరసన కార్యక్రమం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక


పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక

నందవరం : రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ చేపట్టబోయే 'రైతుల అండగా–వైఎస్సార్‌సీపీ' నిరసన కార్యక్రమాన్ని జయప్రందం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రం నందవరంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. శుక్రవారం కర్నూలులో రైతుల అండగా నిరసనగళం వినిపిద్దామని.. రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలలకే రైతులను నట్టేముంచిందన్నారు. కూటమి పాలనలో మాటలతో మభ్యపెట్టడం తప్ప ప్రజలకు చేసేందేమీ లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఇంత వరకు అమలు చేయలేదని, సాధ్యంకాని హామీలు ఇచ్చి అట్టు ప్రజలనూ, ఇట్టు రైతులను మోసం చేశారని విమర్శించారు. రైతులకు తక్షణమే అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు పెట్టుబడిసాయం అందించాలని, ధాన్యానికి మద్దతు ధర కల్పించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిఖిల్‌చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, శివారెడ్డిగౌడ్, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చుక్క మల్లేష్, నరసరాజు, గోనెగండ్ల నాయకులు నాగేష్‌నాయుడు పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న బుట్టారేణుక

మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: అందోళన బాట పట్టిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరవదిక దీక్షలో కూర్చున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఆమెతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆమె కార్మికుల సమస్యలను, న్యాయమైన డిమాండ్లను ఇంజినీరింగ్ కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానంటాయని ఇలాంటి పరిస్థితుల్లో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుట్టాశివనీలకంఠ, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కౌన్సిల ర్లు కామర్తి నాగేషప్ప, ఎంకే శివప్రసాద్, డిష్ కేశవరెడ్డి, మహబుబ్‌బేగ్, సుధాకర్, టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ యూకే రాజశేఖర్, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, పార్టీ బీసీ నాయకులు విరుపాక్షిరెడ్డి,కోటకొండ నరసింహులు, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాలు కోసం ఆర్థిక సాయం

ఎమ్మిగనూరురూరల్: మసీదపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్బిలి హనుమంతు మనవడు అబ్బిలి రాముడికి కృత్రిమ కాలు కోసం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణక రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించారు. గురువారం గ్రామానికి వెళ్లి ప్రమాదంలో కాలు కోల్పోయిన యువకుడు అబ్బిలి రాముడను పరామర్శించి, ఆరోగ్య విషయాలను తెలుసుకొని ధైర్యం చెప్పారు. కృత్రిమ కాలు వేయించుకోవాలని, తన వంతుగా ఆర్థిక సాయం అందిస్తున్నాని తెలిపారు. ఆమెతో బుట్టా నీలకంఠ, గ్రామ నాయకులు రాముడు, ఆంజనేయులు, సుంకన్న, నరసింహులు, తిప్పన్న ఉన్నారు.

మోహన్‌బాబును అరెస్ట్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: హైదరాబాదులో మీడియా ప్రతినిధులపై దాడి చేసిన సినీనటుడు మోహన్ బాబును వెంటనే పోలీసులు అరెస్ట్ చేయాలని స్థానిక ఏపీడబ్ల్యూజే నాయకులు శ్రీనివాసనాయుడు, పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల : పిల్లల విషయంలో తల్లి దండ్రులు జాగ్రత్తలు తీసుకుంటేనే క్రమశిక్షణతో మెలుగుతారని సీఐ గంగాధర్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లలో కొన్ని రకాల గేమ్స్ పిల్లలను చెడువ్యాసలకు అలువాటు పడేవిధంగా ఉన్నాయని, దీని ప్రభావంతో పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలు అవుతున్నారని చెప్పారు. ఇంట్లో ఉన్న తల్లిదండ్రులతో, స్నేహితులతోనూ విచిత్రంగా ప్రవర్తిస్తున్నారన్నారు. పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వకుండా జాగ్రత్త పడాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఆర్థిక సాయం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో గురువారం బుడగజంగాల కడమంచి అంపయ్య మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి వారి కుటుంబానికి మట్టి ఖర్చులకు రూ.5 వేలు వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజ్, తలారి రాందాసు, దయ్యాల బసవరాజు, కటికె మహమ్మద్, తొండబాషా,విభూతి కుమార్, మోతె బంగారప్ప, మోతె పెద్ద కాశన్న, ఇప్పి వీరేష్, నాయకులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి వెండి కవచం బహూకరణ



ఎమ్మిగనూరుటౌన్:పట్టణంలోని నీలకంఠేశ్వర ఆలయ ంలో శ్రీ నీలకంఠేశ్వర స్వామికి, నందీశ్వరుడికి గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, ఆమె భర్త బుట్టా శివ నీలకంఠలు మూడు కిలోల వెండి కవచాలను బహూకరించారు. ఆలయ అర్చకులకు వాటిని అందజేసి వాటిని స్వామివారికి అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శాప్ నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప, ఎంకే శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్ కుమార్, గడ్డం నారాయణరెడ్డి, విరూపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

నందీశ్వరుడిని వెండికవచంతో అలంకరిస్తున్న బుట్టారేణుక దంపతులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మణి మంజరి

గోనెగండ్ల : గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ మణి మంజరి సూచించారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో గ్రామ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాంతీయకరణ అనే అంశంపై మండలంలోని సర్పంచులు, వీఆర్వోలు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలలో తొమ్మిది థీమ్స్‌ని సెలెక్ట్ చేసుకుని అన్ని రంగాలలో గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ శివ శంకర్, ఈఓఆర్డీ అనంతసేన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందవరం : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులకు ఈఓపీఆర్డీ సందీప్ ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ పుల్లయ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ-2 రఘునాథ్, పీఆర్ఏఈ నరసింహులు, సూపరిండెంట్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్చాలి


వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ నాయకురాళ్లు

ఆదోని రూరల్: మినీ అంగన్‌వాడీ సెంటర్‌లను మెయిన్ సెంటర్‌లుగా మార్చాలన్న హామీని కూటమి ప్రభుత్వం సత్వరమే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి సభ్యులు గౌసియాబీ, జానకి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు రాష్ట్రంలో ఉన్న పేద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అనేక సేవలు అందిస్తూ అంగన్‌వాడీ సెంటర్‌లను నిర్వహిస్తుండగా.. ప్రభుత్వం వారిపై అదనపు భారాలు మోపుతోందన్నారు. గతేడాది అంగన్‌వాడీ సంఘాలు సమ్మె చేయగా.. నేడు అధికారంలో ఉన్న కూటమి నాయకులంతా మద్దతు తెలిపారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడం లేదన్నా రు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు టి.వీరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.